హిందూ కుటుంబాలను వేధిస్తూ..
మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?:
రాంచందర్ రావు ఫైర్ 2లో..



RNI No: APTEL/2018/76747

# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | శనివారం | సంపుటి: 9 | సంచిక: 226 | పేజీలు: 04 | వెల: 5 /- | 15 ఆగస్టు 2026 |




## ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ 'టిమ్స్'

### 17న ప్రారంభించనున్న రేవంత్ రెడ్డి




- అక్టోబర్‌కు పూర్తిస్థాయిలో అందుబాటు
- నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి హోదాతో కార్యకలాపాలు
- రూ.1,070 కోట్ల వ్యయంతో 1,082 పడకలతో నిర్మాణం
- మొదట 582 పడకలతో సేవలు

హైదరాబాద్, నవతరం: నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మించిన సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్) ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22.6 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,070 కోట్ల భారీ బడ్జెట్‌తో దీన్ని నిర్మించారు. మొత్తం 1082 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో సేవలను ప్రారంభించనున్నారు. మిగిలిన 500 పడకలు ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే మే నెల నుంచి ఓపీ విభాగంలో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, రోజూ 200 నుంచి 250 మంది వరకు రోగులు చికిత్స పొందుతున్నారు.

ఈ ఆసుపత్రి ప్రధానంగా నాలుగు కీలక విభాగాలకు కేంద్రంగా నిలవనుంది. కార్డియాక్ (గుండె సంబంధిత), నెఫ్రాలజీ-యూరాలజీ (మూత్రపిండాల సంబంధిత), అవయవ మార్పిడి, ట్రామా విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. వీటికి అనుబంధంగా మరో 37 విభాగాలు పనిచేస్తాయి. ఈ ఆస్పత్రికి నిమ్స్ తరహాలోనే స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు. దీంతో నిధులను సొంతంగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, తొలి ఐదారేళ్ల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది.

వాస్తవానికి, గత ఏడాది డిసెంబర్‌లో, ఆ తర్వాత ఉగాదికి ఈ ఆసుపత్రిని ప్రారంభించాలని భావించినా, పనులు పూర్తికాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని పనులు పూర్తికావడంతో ప్రభుత్వం దీనిని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

## ఆన్‌లైన్‌లో తిరుమల శ్రీవారి సేవలు బుక్ చేస్తున్నారా?..

# మోసగాళ్లతో జాగ్రత్త!

- నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ సందేశాలపై భక్తులకు టీటీడీ అలర్ట్
- శ్రీవారి దర్శనం, వసతి పేరుతో ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేస్తున్న మోసగాళ్లు
- గత రెండేళ్లలో 259 నకిలీ వెబ్‌సైట్ల గుర్తింపు, నిర్వాహకులపై కేసులు నమోదు
- బుకింగ్‌ల కోసం అధికారిక వెబ్‌సైట్, యాప్ మాత్రమే వాడాలని విజ్ఞప్తి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టీకరణ

తిరుమల, నవతరం: కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి గదుల బుకింగ్‌ల పేరుతో ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల పట్ల భక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుక్రవారం ఒక ప్రకటనలో గట్టిగా హెచ్చరించింది. టీటీడీ పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ సందేశాలు, సోషల్ మీడియా పేజీలను సృష్టించి కొందరు మోసగాళ్లు భక్తుల భక్తిని ఆసరాగా చేసుకుని ఆర్థికంగా దోచుకుంటున్నారని, ఇటువంటి మోసాల బారిన పడవద్దని విజ్ఞప్తి చేసింది.

**మోసాల స్వరూపం ఇదీ..**

కొందరు కేటుగాళ్లు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన విధంగా నకిలీ వెబ్‌సైట్లను రూపొందిస్తున్నారు. టీటీడీ లోగో, శ్రీవారి చిత్రాలను వాడుతూ భక్తులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. సులభంగా శ్రీవారి దర్శనం, కల్యాణోత్సవం వంటి ఆర్జిత సేవలు, తిరుమలలో వసతి గదులు ఇప్పిస్తామని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా పేజీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఈ ప్రచారాన్ని నమ్మిన అమాయక భక్తులు, వారిని సంప్రదించినప్పుడు ఆన్‌లైన్ ద్వారా మిగతా 4లో..



## హిందూ కుటుంబాలను వేధిస్తూ.. మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?: రాంచందర్ రావు ఫైర్

- పాతబస్తీలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని రేవంత్ చెప్పారన్న రాంచందర్ రావు
- విద్యుత్ బిల్లులు చెల్లించని మైనార్టీలపై సానుభూతి ఎందుకని ప్రశ్న
- ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు



హైదరాబాద్రా, నవతరం: తబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు.

పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని సానుభూతిని, విద్యుత్ బిల్లులు చెల్లించని మైనారిటీల విషయంలో ఎందుకు చూపిస్తున్నారని నిలదీశారు.

ఒకవైపు సామాన్య పేద హిందూ కుటుంబాలపై హైడ్రాను ప్రయోగిస్తూ వేధింపులకు గురిచేస్తూ... మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు కట్టకపోవడాన్ని సమర్థిస్తూ ప్రోత్సహించేలా మాట్లాడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, ఖిలాఫత్ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు వారి విధానంలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు.

## సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందుతుల అరెస్ట్

- సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందుతుల మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు

వేములవాడ, నవతరం: నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేట్‌లోని అల్మాస్‌గూడలో నివాసం ఉంటున్న కిలుకాని సాయిచంద్ (30) సూర్యాపేటకు చెందిన వ్యక్తిగా, ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేట్‌లో నివాసం ఉంటున్న కట్కూరి శరత్ కుమార్ (31) అనే వ్యక్తులు మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్సాక్షన్ సెంటర్లకు సంబంధించిన ఫోన్ నంబర్లను గూగుల్, టెలిగ్రామ్ ద్వారా సేకరిస్తు అమాయక బాధితులకు ఫోన్ చేసి, తాము ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి అనే పోలీస్ అధికారిగా పరిచయం చేసుకుని, పోలీస్ అధికారులకు అత్యవసరంగా హాస్పిటల్ ఖర్చుల కోసం డబ్బులు అవసరమయ్యాయని, వెంటనే ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించాలని నమ్మించే వారని,నిందితులు తమ నేరానికి అనుగుణంగా ముందుగానే ఒక పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి, తమ వాహనం లేదా బోర్ బండి రిపేర్‌కు వచ్చిందని, తమ సర్ డబ్బులు వారి ఫోన్ నంబర్‌కు పంపిస్తారని చెప్పి వారి నంబర్‌ను తీసుకుని, ఆ తర్వాత ఆ నంబర్‌ను మీసేవ నిర్వాహకులకు ఇచ్చి, బాధితుల నుంచి ఆన్‌లైన్‌లో డబ్బులు బదిలీ చేయించేవారని, డబ్బులు బదిలీ అయిన అనంతరం నిందితులు పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి నగదును తీసుకునేవారని తెలిపారు. ఇందులో భాగంగా నిందితులు సాయిచంద్, శరత్ కుమార్‌లు చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు ఫోన్ చేసి, తాము చందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డిగా మాట్లాడుతున్నామని పరిచయం చేసుకున్నారు. తన బాబు ప్రాణం బాగోలేక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించామని, అత్యవసరంగా రూ.70,000 అవసరముందని, డబ్బులు పంపిస్తే హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఇస్తానని పెంటయ్యను నమ్మించారు. నిందితులు చెప్పిన మాటలను నిజమని నమ్మిన పెంటయ్య డబ్బులు పంపేందుకు సిద్ధం కాగా, నిందితులు హైదరాబాద్‌కు చెందిన ఒక పెట్రోల్ బంక్ ఫోన్ నంబర్‌ను అతనికి ఇచ్చారు. ఆ నంబర్‌కు రూ.70,000 ఆన్‌లైన్‌లో పంపించాడు. డబ్బులు పంపిన అనంతరం నిందితులు తమ మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన పెంటయ్య చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చందుర్తి సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి నిందితుల అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి, నిందితుల నుంచి నేరం ద్వారా సమకూరిన సొమ్ములో భాగంగా రూ.18,000 నగదు, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకొని రిమాండ్ కి తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందుతులను అరెస్ట్ చేసిన సి.ఐ రవీందర్,ఎస్.ఐ రమేష్, ఆర్.ఎస్.ఐ జునైద్, సిబ్బందిఅనిల్, గంగ రెడ్డి, డిఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## వందేమాతరం..! ఒక స్వాతంత్ర్య సమర శంఖారావం..!!

## వందేమాతరం... వందేమాతరం...!

ఏ పాట వింటే...
భారతీయుల ఒళ్లంతా
స్వాతంత్ర్య పులకింతలతో
పులకరిస్తుందో...

ఏ పాట వింటే...
తెల్లదొరల గుండెల్లో
మరఫిరంగులు
మోతమోగిస్తాయో...

ఏ పాట వింటే...
ప్రజలంతా ప్రభంజనమై
ఉప్పెనై ఉప్పొంగి
ఉక్కు సంకెళ్లపై
విరుచుకుపడతారో...

ఏ పాట వింటే...
నిద్రించిన నరనరాల్లో
నిప్పురవ్వలు నాటుకుని
తరతరాల స్వాతంత్ర్య కాంక్ష
తుఫానై తలెత్తుతుందో...

అదే...అదే...
మన జాతి గుండెల్లో
నిత్యం నినదించే
వందేమాతరం...

వందేమాతరమంటే...
ఒక పాట కాదు
ఒక పోరాటపు తూటా...

వందేమాతరమంటే...
ఒక గేయం కాదు
ఒక విప్లవాయుధం...

వందేమాతరమంటే...
ఒక నినాదం కాదు
ఒక స్వేచ్ఛా శంఖారావం
ఒక జాతి గుండె చప్పుడు...

వందేమాతరమంటే...
పిడికిలి బిగించిన ప్రజల
గుండెల్లో ఒక సింహనాదం...

భగత్‌సింగ్ ఉరికంబంపై
విప్లవ దీపమై వెలిగింది...
వందేమాతరం

ఝాన్సీ లక్ష్మీబాయి
ఖడ్గధారలో
వీర గర్జనై విరిసింది...
వందేమాతరం

అల్లూరి సీతారామరాజు
అడవిబాటల్లో
అగ్నికణమై అల్లుకుంది...
వందేమాతరం

ఎందరో అమరవీరుల
రక్తనాళాల్లో పరుగెత్తి
సంకెళ్లను సవాలు చేసిన
స్వాతంత్ర్య రణతంత్రమైంది...
వందేమాతరం...

అది...బానిస బ్రతుకులు
బిగుసుకున్న పెదవులకు
విడుదల పలికిన శబ్దం..

అది...భయంతో వణికిన
భారత భుజాలకు
వీరత్వం తొడిగిన మంత్రం...

అది...మరణాన్ని మించిన
మాతృభూమి మమకారం...

వందేమాతరం...
ఒక స్వాతంత్ర్య జ్వాల...
ఒక దీక్ష ఒక ఆరని ఆకాంక్ష...

బెంగాల్ కవి
బంకిమ్‌చంద్ర ఛటర్జీ
భరతమాత నుదుటన
దిద్దిన సింధూరాక్షరం...

కాలం చెరపలేకపోయింది...
కత్తులు కూల్చలేకపోయాయి...
కారాగారాలు
బంధించలేకపోయాయి...
బుల్లెట్లు గర్జించే దానిగొంతును
మూయించలేకపోయాయి...

ఎందుకంటే–
వందేమాతరం
కంఠంలో పుట్టిన గీతం కాదు...
కోట్లాది గుండెల్లో
పుట్టిన స్వాతంత్ర్య జ్వాల..
ఒక దీక్ష ఒక ఆరని ఆకాంక్ష...

ఆ జ్వాలకు
నూట యాభై వసంతాలు...
ఆ జ్వాల వెలుగులో
మన స్వాతంత్ర్యానికి
డెబ్బై తొమ్మిది సంవత్సరాల ప్రస్థానం...

ఇంకా చదవండి..

రేపు...ఎనభైవ స్వాతంత్ర్య దినోత్సవం
ఎర్రకోటపై ఎగిరే మువ్వన్నెల జెండా
ఆనాటి త్యాగాలకు
ఈ నాటి త్రివర్ణ సమాధానం...

మనం స్వేచ్ఛగా పీల్చే...
ప్రతి వాయువులో
ఒక అమరవీరుని త్యాగం ఉంది...

మనం నిర్భయంగా
పలికే...ప్రతి మాటలో
ఒక పోరాటయోధుని పిడికిలి ఉంది...

మనం తిలకించే...
ప్రతి ఉషోదయంలో
ఒక త్యాగమూర్తి రక్తపు వెలుగు ఉంది..
అందుకే మిత్రులారా...
వందేమాతరం ఆలపించడమంటే...
భారతమాతను భక్తితో స్మరించడం
కన్నతల్లి భారతమాతను కాపాడతామని
మన గుండెలమీద ప్రమాణం చేయడం...

వందేమాతరం అంటే...
గతాన్ని గౌరవించడం...
వర్తమానాన్ని
బాధ్యతగా మలచుకోవడం...
భవిష్యత్తును
భారతమాత కీర్తితో నింపడం...

వందేమాతరం అంటే
భారతమాత కళ్లలో కాంతి...
భారతజాతి గుండెల్లో గర్వం..
భారత భవిష్యత్తు
నుదుటన దిద్దిన విజయ తిలకం...

అందుకే–వందేమాతరాన్ని
గొంతులో గీతంగా కాదు...
గుండెల్లో గీతగా నిలుపుదాం..

నినాదంగా కాదు...
నిజజీవిత నీతిగా మలచుకుందాం..
స్వాతంత్ర్యపు వేడుకగనే కాదు...
బాధ్యతగా భుజాన మోసుకెళ్దాం...

వందేమాతరం...వందేమాతరం...!

(79 సంవత్సరాల స్వాతంత్ర్యానికి... 150 సంవత్సరాల వందేమాతరం బిల్లు పార్లమెంటులో పాస్ ఐన శుభ సందర్భంగా అందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.)



రచన
కవిరత్న, సాహిత్య ధీర, సహస్ర కవి భూషణ్, పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్

## స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

### రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



- ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై ఆకునూరి మురళి ఆందోళన
- భారీ ఫీజులతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని సూచన
- ఫీజుల నియంత్రణ కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడి
- తల్లిదండ్రులు, విద్యావేత్తలు హాజరుకావాలని పిలుపు

హైదరాబాద్, నవతరం: ప్రైవేట్ పాఠశాలల ఫీజుల పెంపుపై విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయని ఆరోపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఈ భారం పడుతోందని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో ఆయన ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. నాణ్యమైన విద్య అందక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేని పరిస్థితి ఉందన్నారు. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో భారీ ఫీజులతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించలేకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు సరైన చట్టం లేకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టం కోసం తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆకునూరి మురళి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు..

- గోదావరి పుష్కరాలపై రేవంత్ సర్కారు ఫోకస్
- సెప్టెంబర్ మొదటి వారం నుంచి పనులు ప్రారంభించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశం
- రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక అధికారుల నియామకం
- పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్‌బోర్డ్
- పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- రూ.1000 కోట్లు కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం



హైదరాబాద్, నవతరం: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ పుష్కరాల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'గోదావరి పుష్కరాలు-2027'పై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా జరుగుతున్న పురోగతిని కమిటీ సభ్యులు సమీక్షించి, అధికారులకు కీలక సూచనలు చేశారు.

భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే 'టైర్-1' ప్రాంతాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా సీనియర్ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి, స్థానిక నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పండితులను భాగస్వాములను చేయాలని సూచించారు. భక్తులకు సేవ చేసేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే పుష్కరాలు విజయవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

మాజీ మంత్రి అప్పలరాజుకు కోర్టులో...

# బెయిల్ మంజూరు

- రోడ్డు ప్రమాదం కేసులో సాక్ష్యాల తారుమారు ఆరోపణ
- జులై 22 నుంచి రిమాండ్‌లో ఉన్న అప్పలరాజు
- పలాసలో వైసీపీ శ్రేణుల్లో హర్షం



పలాస, ఆగస్టు 14, నవతరం: రోడ్డు ప్రమాదం కేసులో సాక్ష్యాలను తారుమారు చేశారన్న ఆరోపణలపై జులై 22 నుంచి రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత సీదిరి అప్పలరాజుకు సోంపేట ఆర్ అదనపు జిల్లా కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పిటిషన్‌పై గత కొంతకాలంగా విచారణలు, వాయిదాలు కొనసాగుతున్నాయి. తాజాగా శుక్రవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం అప్పలరాజుకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు విధించిన షరతులు, తదుపరి న్యాయపరమైన ప్రక్రియపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

**కేసు నేపథ్యం ఇదే**

జులై 10వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గోరెల గ్రామానికి చెందిన కాపరి దానయ్య మృతి చెందారు. ఈ ఘటనలో అప్పలరాజు కుమారుడు ఆర్ వర్మపై కేసు నమోదైంది. అనంతరం ఈ కేసులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలతో పోలీసులు అప్పలరాజును నిందితుడిగా చేర్చారు. జులై 22న ఆయనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి అప్పలరాజు అంశోలు జైలులో ఉన్నారు. అప్పలరాజు అరెస్ట్ తర్వాత ఈ వ్యవహారం స్థానికంగా రాజకీయంగా కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది రాజకీయ కక్షతో వేసిన కేసు అని వైసీపీ నేతలు, కార్యకర్తలు పలుమార్లు ఆరోపించారు. అప్పలరాజు అరెస్ట్‌ను ఖండిస్తూ పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేటల్లో నిరసన కార్యక్రమాలు, రాస్తారోకోలు చేపట్టారు.

**బెయిల్‌తో ఉత్సాహం**

కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలియగానే పలాసలో వైసీపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. "న్యాయం గెలిచింది. అప్పలరాజు అన్న త్వరలో మన మధ్యకు వస్తున్నారు" అంటూ నినాదాలు చేశారు. 2009 నుంచి పలాస నియోజకవర్గానికి వరుసగా ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అప్పలరాజు ఈ ప్రాంతంలో బలమైన పట్టు కలిగి ఉన్నారు. ఆయన అరెస్ట్‌తో స్థానికంగా పార్టీ కార్యకలాపాలు కొంత మందగించాయి. ఇప్పుడు బెయిల్ రావడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇది వైసీపీకి కలిసి వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల కాపీలు జైలు అధికారులకు అందిన తర్వాత అన్ని లాంఛనాలు పూర్తి చేసి అప్పలరాజు విడుదలయ్యే అవకాశం ఉంది.

# చంద్రగిరి నగర్లో.. 'గుండా' గిరి

- ·ఇల్లు మార్టిగేజ్ పేరుతో అప్పులు
- ·తిరిగి చెల్లించకుండా కాలాయాపన
- ·డబ్బులు అడిగితే.. బెదిరింపులు
- ·నయా దందాకు తెరలేపిన అన్నా, చెల్లెళ్ళు
- ·సలీం నుంచి రక్షణ కావాలంటున్న మహబూబ్ అలీ

**అవసరాలున్నాయ్.. డబ్బులు కావాలి, ఇంట్రెస్ట్ ఎంతైనా ఇస్తాం.. కావాలంటే ఇంట్లో రెండు రూములు, ఒక టాయిలెట్ భాగం మార్టిగేజ్ చేస్తాం.. ఆ భాగానికి వచ్చే కిరాయిలు మీరే తీసుకోండని మభ్య పెడతారు, మాయ చేస్తారు. ఎదుటివారిని నమ్మిస్తారు. తీరా తీసుకున్న డబ్బులు కట్టాల్సి వచ్చేసరికి బెదిరింపులకు దిగుతారు. ఇచ్చిన డబ్బులు మర్చిపోవాలని వార్నింగ్ ఇస్తారు, ఎవరికైనా చెప్పుకొండని దగా చేస్తారు. ఇదీ చంద్రగిరినగర్ లో కమిటీ హాల్ కబ్జా చేసి అందులో ఇల్లు నిర్మించుకున్న ఓ గల్లీ లీడర్ అతడి సోదరి పిట్ట కథ. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు అన్నను మించిపోయింది చెల్లెలు. 'నాకు మా అన్న అండదండలు దండిగా ఉన్నాయి, నన్ను ఎవరూ ఏమీ చేయలేరు' అంటూ తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోగా బెదిరింపులకు దిగుతూ.. తన పబ్బం గడుపుకుంటుంది అంటూ వాపోతున్నాడు బాధితుడు.**

గాజులరామారం, నవతరం: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని గాజులరామారం పక్కనే ఉన్న చంద్రగిరి నగర్ లో ఓ అన్న, ఓ చెల్లెలు ఎదుటివారి డబ్బులు ఎలా ఎగగొట్టాలో చాలా పకడ్బందీగా ప్లాన్ అమలుచేస్తున్నారు. గతంలో చంద్రగిరి నగర్ లో ఉన్న కమిటీ హాల్ కబ్జా చేసి, అందులో అక్రమంగా ఒక ఇంటిని నిర్మించి (తన ఇంటికి ఆనుకుని ఉన్న స్థలంలో) తన చెల్లి అయినటువంటి హాబీబున్నీసా బేగం కు గిఫ్ట్ గా ఇచ్చాడు అబ్దుల్ సలీం అనే గల్లీ లీడర్. అయితే, తనకు అవసరాలున్నాయి.. డబ్బులు కావాలి, ఇంట్రెస్ట్ ఎంతైనా ఇస్తాను అంటూ.. ఇంటిలో కొంతభాగం తాకట్టు పెడతాను, కావాలంటే మార్టిగేజ్ చేస్తాను అంటూ నమ్మబలికించి ఏకంగా ముగ్గురు వ్యక్తుల వద్ద డబ్బులు దండుకున్నట్టు సమాచారం. ఇదే నేపథ్యంలో 'స్థానికంగా నివాసముండే మహబూబ్ అలీ అనే వ్యక్తి నుండి 3,50,000/- రూపాయలు అప్పుగా తీసుకున్న హాబీబున్నీసా బేగం నాలుగు నెలలు మార్టిగేజ్ చేసిన భాగం కిరాయి చెల్లించింది. అప్పుడు ఎంటర్ అయ్యాడు ఛోటా డాన్ సలీం. ఎవరికీ డబ్బులు ఇచ్చేది లేదు, ఇచ్చిన డబ్బులు మర్చిపోవాలంటూ హుకుం జారీ చేశాడు. దీంతో మహబూబ్ అలీ చిక్కుల్లో పడిపోయాడు. అప్పటి నుండి ఇప్పటివరకు సుమారు పద్నాలుగు నెలలు గడుస్తున్నా.. అసలు లేదు, మిత్తి లేదు అన్నట్టు అయిపోయింది కథ. కమిటీ హాల్ ని కబ్జా చేసినోడు తననేమన్నా చేస్తాడేమోనని అయోమయంలో పడిపోయాడు. ఎటు పోవాలో తెలియదు, ఎవరి మద్దతు తీసుకోవాలో తెలియదు. చివరకు మీడియాను ఆశ్రయించాడు. తనకు న్యాయం కావాలి, లేదంటే పోలీసులను ఆశ్రయిస్తానని చెబుతున్నాడు మహబూబ్ అలీ. ఇప్పటికైనా మహబూబ్ అలీ డబ్బులు తిరిగి చెల్లిస్తారా.. మిగతా ఇద్దరిని మాయ చేసినట్టు బరితెగిస్తారా తెలియాల్సి ఉంది.

# పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ప్రధాని మోదీ అడిగిన తొలి ప్రశ్న ఇదే!

- **పహల్గాం దాడిపై తొలిసారి మాట్లాడిన అజిత్ డోభాల్**
- **దాడి వెనుక సూత్రధారి ఎవరని ప్రధాని మోదీ అడిగారని వెల్లడి**
- **ఆపరేషన్ సిందూర్ పేరిట 9 ఉగ్రశిబిరాలపై భారత్ దాడి**
- **నిందితులను వేగంగా గుర్తించిన నిఘా వర్గాలపై ప్రశంసలు**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ మారణకాండలో 26 మంది బలయ్యారు. ఈ దాడి జరిగిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎలా స్పందించారు, ఆయన అడిగిన తొలి ప్రశ్నలు ఏంటి అనే కీలక విషయాలను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తాజాగా వెల్లడించారు. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై రూపొందించిన ఒక డాక్యుమెంటరీలో ఆయన తొలిసారి కెమెరా ముందు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆనాటి ఘటనలను, తెరవెనుక జరిగిన పరిణామాలను వివరించారు.

పహల్గామ్ దాడి జరిగిన సమయంలో...



**మిగతా వార్త కోసం కింది క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి**

# జాతినుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

- జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశం పంపిందన్న ముర్ము
- పరీక్షల విధానంలో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ
- గడిచిన పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడి
- దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చరిత్రాత్మక విజయమన్న రాష్ట్రపతి



న్యూ ఢిల్లీ, నవతరం: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. గడిచిన దశాబ్దంలో ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా దేశం వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించిందని కొనియాడారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, అంతర్గత భద్రతలో సాధించిన విజయాలను, ఆర్థిక ప్రగతిని ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.

**ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు**

ఉగ్రవాదులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్', సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటివి చరిత్రాత్మక నిర్ణయాలని అభివర్ణించారు. "ఆపరేషన్ సిందూర్ మన సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనం. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎంత కచ్చితత్వంతోనైనా చర్యలు తీసుకోగలదని ఈ ఆపరేషన్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారి చర్యల పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని ఇది గట్టి సందేశం పంపింది" అని ఆమె స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల రీత్యా, ముఖ్యంగా రైతుల శ్రేయస్సు దృష్ట్యా తీసుకున్న కీలకమైన ముందడుగు అని తెలిపారు.

**అభివృద్ధి, సంక్షేమంలో దేశం ముందంజ**

గడిచిన పదేళ్లలో దేశం "వికాస్, విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వేగంగా పురోగమించిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని తెలిపారు. ప్రపంచంలోనే

**మిగతా వార్త కోసం కింది క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి**

## స్వాతంత్ర్యం ఆగస్టు 15, అర్ధరాత్రే ఎందుకు?

# ఆసక్తికర కథ



- ఆగస్టు 15ను స్వాతంత్ర్య దినోత్సవ తేదీగా ప్రకటించిన మౌంట్‌బాటన్
- జ్యోతిషపరంగా మంచి ముహూర్తం కాదంటూ ఆందోళనలు
- వరదలు, కరవు, క్షామం, హింస వంటి విపత్తులు రావచ్చని హెచ్చరిక
- అప్పటికే ఏర్పాట్లు ప్రారంభమైన నేపథ్యంలో తేదీ మార్చే అవకాశం లేదు
- మధ్యేమార్గంగా అర్ధరాత్రి ఉన్న అనుకూల ముహూర్తానికి మార్చాలని నిర్ణయం



డా. నర్సింలు ఎల్లంపల్లి

అది ఓ చారిత్రక రాత్రి.. తెల్లవారితే దేశం మొత్తం స్వేచ్ఛా భారతాన్ని చూడబోతోంది. కానీ స్వాతంత్ర్యం ప్రకటించాల్సిన సమయం దగ్గరపడే కొద్దీ ఓ విచిత్రమైన చర్చ మొదలైంది. ఆగస్టు 15న భారత్ కొత్త ప్రయాణం మొదలుపెట్టడం శుభం కాదని కొందరు జ్యోతిష్యులు హెచ్చరించారు. తేదీని మార్చే పరిస్థితి లేదు. దీంతో అదే తేదీలో.. ఓ ప్రత్యేక సమయాన్ని ఎంచుకునే ఆలోచన తెరపైకి వచ్చింది. చివరకు అర్ధరాత్రి వేళ భారత్ స్వేచ్ఛను అందుకుంది.

**మౌంట్‌బాటన్ ఖరారు చేసిన ఆగస్టు 15**

1947 జూన్ 4న లార్డ్ మౌంట్‌బాటన్ బ్రిటిష్ పాలనకు ముగింపు పలికే తేదీని ప్రకటించారు. ఆగస్టు 15న భారత్‌కు అధికార బదలాయింపు జరగాలని నిర్ణయించారు. ఆ తేదీ ఎంపిక వెనుక మౌంట్‌బాటన్‌కు ప్రత్యేక కారణం ఉంది. 1945లో జపాన్ లొంగిపోయిన రోజుకు ఆగస్టు 15 రెండో వార్షికోత్సవం. అయితే భారత్‌లో ఆ తేదీపై మరో కోణంలో చర్చ మొదలైంది.

**'ఆ రోజు మంచిది కాదు' అన్న జ్యోతిష్యులు**

ఆగస్టు 15 శుభదినం కాదని పలువురు జ్యోతిష్యులు భావించినట్లు చారిత్రక కథనాలు చెబుతున్నాయి. నాటి కలకత్తా, వారణాసి సహా పలు ప్రాంతాల్లో స్వాతంత్ర్య సమయంపై జాతక లెక్కలు పరిశీలించినట్లు సమాచారం. కొత్త దేశానికి ఆ రోజు అనుకూలంగా లేదని కొందరు హెచ్చరించారు. వరదలు, కరవు, క్షామం, హింస వంటి విపత్తులు రావచ్చని ఓ జ్యోతిష్యుడు మౌంట్‌బాటన్‌కు లేఖ రాసినట్లు 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్'లో ప్రస్తావించారు. అయితే ఆ లేఖకు సంబంధించిన అసలు పత్రం మౌంట్‌బాటన్ ఆర్కైవ్స్‌లో ఇప్పటివరకు గుర్తించలేదని సమాచారం.

**తేదీ మార్చడం మాత్రం కుదరదు!**

ఇప్పటికే స్వాతంత్ర్య కార్యక్రమాల ఏర్పాట్లు మొదలయ్యాయి. మౌంట్‌బాటన్ ప్రకటించిన తేదీని వెనక్కి తీసుకోవడం అంత సులభం కాదు. అందుకే తేదీని మార్చడం కంటే సమయాన్ని మార్చే మార్గం గురించి ఆలోచన మొదలైంది. ఆగస్టు 15లోనే అనుకూలమైన ముహూర్తాన్ని వెతకాలని నిర్ణయించినట్లు పలు కథనాలు పేర్కొంటున్నాయి. ఇక్కడి నుంచే భారత స్వాతంత్ర్యానికి అర్ధరాత్రి సమయం ఎలా వచ్చిందన్న అసలు కథ మొదలవుతుంది.

**అర్ధరాత్రి ముహూర్తం**

జ్యోతిష్య లెక్కల్లో అనుకూల సమయాన్ని ఎంచుకునే ప్రయత్నం జరిగింది. అభిజిత్ ముహూర్తం, పుష్య నక్షత్రం వంటి అంశాలపై చర్చ సాగినట్లు పుస్తకాల్లో ప్రస్తావనలు ఉన్నాయి. ఆగస్టు 14 నుంచి 15కి మారే అర్ధరాత్రి సమయం అనుకూలంగా ఉంటుందని భావించారు.దీంతో ఆగస్టు 15 తేదీ అలాగే ఉండేలా.. అధికార బదలాయింపు సమయాన్ని అర్ధరాత్రికి మార్చే ఆలోచన ముందుకొచ్చింది. చివరకు ఇదే మార్గం ఆచరణలోకి వచ్చింది.

**నెహ్రూ వేసిన ప్రణాళిక**

ఆగస్టు 14న రాజ్యాంగ సభ సమావేశమైంది. సభను రాత్రి వరకు కొనసాగించి.. అర్ధరాత్రి దాటగానే స్వాతంత్ర్య ఘట్టాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో అధికారికంగా ఆగస్టు 15నే స్వాతంత్ర్య దినంగా కొనసాగింది. అదే సమయంలో జ్యోతిష్యులు అనుకూలంగా భావించిన సమయానికి అధికార బదలాయింపు జరిగే అవకాశం ఏర్పడింది. తేదీ విషయంలో మౌంట్‌బాటన్ నిర్ణయం.. సమయం విషయంలో భారత నేతల ఆలోచన.. ఇలా రెండూ ఒకే చోట కలిశాయి.

**గడియారం 12 కొట్టగానే.. చరిత్ర మారిపోయింది**

1947 ఆగస్టు 14 రాత్రి రాజ్యాంగ సభలో చారిత్రక సమావేశం కొనసాగింది. అర్ధరాత్రి దాటగానే భారత్ స్వతంత్ర దేశంగా కొత్త అధ్యాయంలోకి అడుగుపెట్టింది. అదే సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగం చేశారు. "ప్రపంచం నిద్రిస్తున్న వేళ.. అర్ధరాత్రి భారత్ స్వేచ్ఛలోకి మేల్కొంటుంది" అంటూ ఆయన దేశానికి కొత్త దిశను చూపించారు. అలా ఆగస్టు 15 ఉదయం కంటే ముందే.. అర్ధరాత్రి వేళ స్వేచ్ఛా భారతం ఆవిర్భవించింది.

## ఆన్‌లైన్‌లో తిరుమల శ్రీవారి సేవలు బుక్ చేస్తున్నారా? మోసగాళ్లతో జాగ్రత్త!

**మొదటి పేజీ తరువాయి...** డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు. డబ్బులు చెల్లించిన తర్వాత, వారు నకిలీ బుకింగ్ పత్రాలను పంపడం లేదా పూర్తిగా అదృశ్యం కావడం వంటివి చేస్తున్నారు. తీరా తిరుమల వచ్చిన తర్వాత తాము మోసపోయామని గ్రహించిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తరహా ఫిర్యాదులు టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఇటీవలి కాలంలో అధికంగా అందుతున్నాయి.

**ఉక్కుపాదం మోపుతున్న టీటీడీ**

ఈ సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు టీటీడీ పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. టీటీడీ ఐటీ విభాగం, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం, సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. టీటీడీ పేరు, లోగో, ట్రేడ్‌మార్క్‌లను దుర్వినియోగం చేస్తున్న నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలను నిరంతరం పర్యవేక్షిస్తోంది.

గత రెండేళ్లలో ఇటువంటి 259 నకిలీ వెబ్‌సైట్లను గుర్తించి, వాటిని బ్లాక్ చేయించినట్లు టీటీడీ తెలిపింది. అంతేకాకుండా, ఈ వెబ్‌సైట్ల నిర్వాహకులపై సైబర్ చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో కూడా టీటీడీ మేధో సంపత్తి హక్కులను (Intellectual Property Rights) ఉల్లంఘించే వ్యక్తులు, సంస్థలపై కాపీరైట్, ట్రేడ్‌మార్క్ చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

**భక్తులు పాటించాల్సిన జాగ్రత్తలు**

ఆన్‌లైన్ మోసగాళ్ల వలలో చిక్కుకుండా ఉండేందుకు భక్తులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ సూచించింది.

- శ్రీవారి దర్శనం, సేవలు, వసతి గదుల బుకింగ్‌ల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా టీటీడీ అధికారిక మొబైల్ యాప్‌ను మాత్రమే ఉపయోగించాలి.
- వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనధికారిక బుకింగ్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. వాటిని క్లిక్ చేయవద్దు.
- పరిచయం లేని వ్యక్తులు ఫోన్ చేసి దర్శనం లేదా సేవలు ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దు. వారికి ఎలాంటి డబ్బులు పంపవద్దు.
- ఏదైనా వెబ్‌సైట్ లేదా సోషల్ మీడియా ఖాతా టీటీడీ పేరుతో ఉన్నప్పటికీ, అది అధికారికమైనదో కాదో నిర్ధారించుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలి.
- అనుమానాస్పద వెబ్‌సైట్లు లేదా సందేశాలు కనిపిస్తే వెంటనే టీటీడీ కాల్ సెంటర్ లేదా సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఆనందంగా దర్శనం చేసుకుని వెళ్లాలన్నదే టీటీడీ ఉద్దేశమని, ఆన్‌లైన్ మోసగాళ్ల కారణంగా భక్తులు ఇబ్బందులు పడకూడదని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఈ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులందరూ అప్రమత్తంగా ఉండి, దేవస్థానానికి సహకరించాలని కోరారు.

## సెప్టెంబరులో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!

న్యూ ఢిల్లీ, నవతరం: ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సెప్టెంబరులో భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో ఆయన పాల్గొననున్నట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ వెల్లడించింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్.. 18వ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది.

భారత్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే అజెండాతో సాగనుంది. 2026 ఆరంభంలో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ నుంచి భారత్ స్వీకరించింది. పెజెష్కియాన్ పర్యటనకు మరో ప్రాధాన్యం ఉంది. 2024 అక్టోబరులో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఇరాన్ 2024లో బ్రిక్స్‌లో పూర్తిస్థాయి సభ్యత్వం పొందింది. అదే సమయంలో ఈజిప్ట్, ఇథియోపియా, యూఏఈ కూడా కూటమిలో చేరాయి. 2025లో ఇండోనేషియా సభ్యత్వం పొందడంతో బ్రిక్స్ పూర్తిస్థాయి సభ్యుల సంఖ్య 11కి చేరింది. ఇటీవలే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ భారత్‌కు వచ్చారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడంలో భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదని చెప్పారు. అవసరమైతే భారత్ చేపట్టే నిర్మాణాత్మక ప్రయత్నాలను స్వాగతిస్తామని స్పష్టం చేశారు.

## కుమారి ఆంటీ డబుల్ ధమాకా.. సినిమాలో నటన.. ఫుడ్‌పై రూ. 100 డిస్కౌంట్ ఆఫర్

హైదరాబాద్, నవతరం: హైదరాబాద్ వీధుల్లో రుచికరమైన స్ట్రీట్ ఫుడ్ అమ్ముతూ సోషల్ మీడియాలో అనూహ్యమైన స్టార్‌డమ్ సంపాదించుకున్న కుమారి ఆంటీ ఇప్పుడు వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. తన మాటతీరు, కస్టమర్లతో ఆప్యాయంగా పలకరించే విధానంతో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆమె.. 'పాంచాలి పంచభర్తృక' అనే చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రకటించిన ఓ వినూత్న ఆఫర్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేపుతోంది. సినిమా టికెట్ చూపించిన వారికి తన ఫుడ్ స్టాల్‌లో బిల్లుపై రూ.100 డిస్కౌంట్ ఇస్తానని ప్రకటించి అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్‌లో జరిగిన 'పాంచాలి పంచభర్తృక' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న కుమారి ఆంటీ ఈ ఆఫర్‌ను ప్రకటించారు. సినిమాను థియేటర్లలో చూసి, ఆ టికెట్‌ను తన ఫుడ్ కౌంటర్‌కు తీసుకువస్తే భోజనం బిల్లులో రూ.100 తగ్గిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను థియేటర్లలో చూసి ఆదరించాలని ఆమె కోరారు. ఈ ఆఫర్‌తో సినిమాకు ప్రచారం జరగడంతో పాటు, తన ఫుడ్ వ్యాపారానికి కూడా మేలు జరుగుతుందని భావిస్తున్నారు. ఈ ప్రకటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు ఆమె మార్కెటింగ్ ఆలోచనను ప్రశంసిస్తున్నారు.

ఈ సందర్భంగా తన సినీ ప్రయాణం గురించి కుమారి ఆంటీ ఉద్వేగంగా మాట్లాడారు. తాను సినిమాల్లో నటిస్తానని కలలో కూడా ఊహించలేదని, సోషల్ మీడియా వల్లే తనకు ఈ అరుదైన అవకాశం లభించిందని అన్నారు. తనకు ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శకుడు గంగ సప్తశిఖర, నిర్మాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువ అవుతాననే నమ్మకం ఉందని ఆమె పేర్కొన్నారు. సీనియర్ నటుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'పాంచాలి పంచభర్తృక' చిత్రానికి గంగ సప్తశిఖర దర్శకత్వం వహిస్తున్నారు. రాయల్ థ్రీన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరాం ఆర్ట్స్ బ్యానర్లపై వెంకట్ దుగ్గిరెడ్డి, రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం నిర్మిస్తున్నారు. రోల్ రైడా, జెమినీ సురేశ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే సోషల్ మీడియాలో కుమారి ఆంటీకి ఉన్న క్రేజ్‌తో పాటు ఆమె ప్రకటించిన ఈ ఆఫర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com,
Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com